సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం ၊ 28 ၊ నవంబర్ ၊ 2022



ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి

మండల కేంద్రంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు ఆదవారం పర్యటించారు. 8లో



హాయిగా..

చలి నేపథ్యంలో జిల్లాలోని ఆశ్రమ విద్యార్థులు ఇబ్బందులు పడకుండా సుమారు లక్ష మందికి ప్రభుత్వం రగ్గులు పంపిణీ చేసింది.

వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుల నియామకం

సాక్షి, పాడేరు: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులను నియమిస్తూ ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. అరకుకు కొండపల్లి కొండలరావు, పాడేరుకు చొక్కాకుల వెంకటరావు, రంపచోడవరానికి కర్రి పాపారాయుడు నియమితులయ్యారు.

న్యూస్‌రీల్

15 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

- పట్టుకున్న అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

చింతూరు: మండలంలోని చట్టి నుంచి కాకినాడ జిల్లా జగ్గంపేటకు అక్రమంగా తరలిస్తున్న 15 టన్నుల రేషన్ బియ్యాన్ని అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. చట్టి నుంచి లారీలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు వారు అప్రమత్తమయ్యారు. వారివురూ చింతూరు శబరినది వంతెన సమీపంలో లారీని తనిఖీ చేయగా రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఒకొక్కటి 50 కిలోల చొప్పున 300 బియ్యం బస్తాలు లభ్యమయ్యాయి. బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కారం సుబ్బారావు మాట్లాడుతూ సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు వాహనాన్ని సీజ్ చేశామని చెప్పారు. బియ్యాన్ని చింతూరులోని జీసీసీ గోదాముకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఆశ్రమ విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలతో హెచ్‌ఎం, పీడీ, పీఈటీలు

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు గిరిజన బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఝాన్సీహేన్సన్ తెలిపారు. వారిలో సీహెచ్. గౌరంజలి (3000 వాక్), కె.ఆదిలక్ష్మి (వాలీబాల్) , కె.శ్రీలత (ఖోఖో), ఎం మహాలక్ష్మి (1500 మీటర్ల పరుగు), దుర్గాంబిక (800 మీటర్ల పరుగు) పోటీలకు ఎంపికైనట్టు ఆమె తెలిపారు. వీరిని పీడీ నాగమణి, పీఈటీ పద్మావతిలను డిప్యూటీ వార్డెన్ లక్ష్మీకాంత, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కనులపండువగా అమ్మవారి రథయాత్ర



ఊరేగింపులో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

రాజవొమ్మంగి: మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో ఆదివారం కనకదుర్గమ్మ అమ్మవారి రథం యాత్ర వైభవంగా జరిగింది. విజయవాడ నుంచి తరలివచ్చిన అమ్మవారి రథ యాత్రకు భక్తులు భక్తిశ్రద్ధలతో సంప్రదాయంగా స్వాగతం పలికారు. పసుపు కుంకుమ, పండ్లు, పూలు సమర్పించి పూజలు చేశారు. బాణసంచా, డప్పువాయిద్యాల నడుమ అమ్మవారి యాత్ర కనులపండువగా సాగుతోంది. జడ్డంగిలో అమ్మవారి రథ యాత్రలో భక్తులు భజనలు, కోలాటం, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి రథయాత్ర సోమవారం కూడా మండలంలో కొనసాగుతోందని జడ్డంగి గురుభవాని తోట సూరిబాబు తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి కుస్తీ పోటీలు

కొయ్యూరు: స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్)లో భాగంగా ఈనెల 29న కొయ్యూరు బాలుర ఆశ్రమ పాఠశాల-1లో ఉమ్మడి జిల్లా స్థాయి కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నామని కోచ్, పాఠశాల పీడీ అంబటి నూకరాజు తెలిపారు.ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24న జరగాల్సిన పోటీలను వాతావరణం అనుకూలించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశామని తెలిపారు. అండర్ 14,17 విభాగంలో పోటీలు ఉంటాయన్నారు.విశాఖ, అనకాపల్లి,అల్లూరి జిల్లాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఇక్కడ గెలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవుతారన్నారు.



బల్దా పర్యాటక ప్రాంతంలో థింసా నృత్యం చేస్తున్న పర్యాటకులు



మన్యంలో ఉదయ భానుడి అందాన్ని తిలకిస్తున్న పర్యాటకులు



చాపరాయి జలపాతానికి తరలివచ్చిన పర్యాటకులు



కన్నేరు వాగు చెంత పర్యాటకుల సందడి

మురిసిన మన్యం

అందాలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకులను చూసి మన్యం మురిసిపోయింది. సహజసిద్ధ అందాలతో రా..రమ్మని ఆహ్వానిస్తూ అలరించింది. మంచు పోయగాలతో మైమరిపించింది. వలిసెపూల అందాలతో కనువిందు చేసింది.

- వీకెండ్ కావడంతో పోటెత్తిన పర్యాటకులు
- కిటకిటలాడిన సందర్శనీయ ప్రాంతాలు
- పాడేరు, అరకు ప్రాంతాల్లో సందడే సందడి
- కిక్కిరిసిన ప్రధాన రహదారులు
- పర్యాటకశాఖకు భారీగా ఆదాయం

సాక్షి, పాడేరు: మన్యం అందాలకు పర్యాటకులు ఫిదా అయ్యారు. కొద్దిరోజులుగా వాతావరణంలో మార్పు కారణంగా మంచు అంతంతమాత్రంగానే కురువడంతో పర్యాటకులు నిరుత్సాహానికి గురయ్యారు. శనివారం నుంచి మళ్లీ మంచు దట్టంగా కురుస్తోంది. ఈ అందాలను తిలకించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. చింతపల్లి మండలంలో చెరువులవేనం, పాడేరు మండలంలో వంజంగిహిల్స్, అరకులోయ మండలంలో మాడగుడ, హుకుంపేట మండలం సీతమ్మకొండ ప్రాంతంలో ప్రకృతి అందాలను చూసి మురిసిపోయారు. పర్యాటక ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి.

గిరిజన మ్యూజియానికి రూ.3 లక్షలు..

అరకులోయ గిరిజన మ్యూజియానికి సాయంత్రం 4 గంటల వరకు సుమారు ఐదు వేల మంది సందర్శించారు. రూ.3 లక్షల మేర ఆదాయం వచ్చిందని మ్యూజియం మేనేజర్ మురళీ తెలిపారు. అరకు-విశాఖ, పాడేరు-అరకు, పాడేరు-చోడవరం, చింతపల్లి-నర్సీపట్నం, రహదారులు పర్యాటకుల వాహనాలతో కిక్కిరిసిపోయాయి. దీంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది.

డుంబ్రిగుడ/ముంచంగిపుట్టు: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని పర్యాటక ప్రాంతమైన బల్దాలో ఎత్తయిన అటవీ ప్రాంతంలో పర్యాటకులు సందడి చేశారు. ఇక్కడి ప్రకృతి అందాలను తిలకించేందుకు అరకు, విశాఖ, పాడేరు, హుకుంపేట ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. థింసా నృత్యం చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

రాణిదుడుమలో..

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతమైన రాణిదుడుమ జలపాతం వద్ద పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. సరిహద్దు ప్రాంతం కావడంతో పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్నానాలు చేస్తూ ప్రకృతి అందాలను తిలకిస్తూ పరవశించిపోయారు. తారాబు, దుడుమ, తదితర జలపాతాలు పర్యాటకులతో కళకళలాడాయి.

అరకులోయ రూరల్: రణజిల్లెడ, వ్యూపాయింట్ ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి.

చాపరాయిలో..

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతానికి మైదాన ప్రాంతం నుంచి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. కుటుంబసమేతంగా స్నానాలు చేస్తూ సందడి చేశారు. వలిసె, పొద్దు తిరుగుడు పూల అందాల్లో ఫొటోలు తీసుకుని ఉత్సాహంగా గడిపారు.



కొత్తపల్లి జలపాతానికి పోటెత్తిన పర్యాటకులు

కన్నేరు వాగు చెంత కోలాహలం

అడ్డతీగల: కొండల నడుమ ఒంపులు తిరుగుతూ బండరాళ్లను తనలో ఇముడ్చుకుని వయ్యారంగా ప్రవహిస్తున్న కన్నేరు వాగు పర్యాటకులతో కోలాహలంగా మారింది. తూర్పుగోదావరి జిల్లా నుంచి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. వాగులో స్నానాలు చేశారు. ఇక్కడే భోజనాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. పింజరికొండ జలపాతం ప్రాంతానికి పరిమిత సంఖ్యలో పర్యాటకులు వచ్చారు.



బొర్రాగుహల వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

బొర్రాకు భారీగా..

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. భారీగా తరలిరావడంతో గుహలు ప్రాంగణంలోని సందడి వాతావరణం నెలకొంది. సుమారు 9796 మంది సందర్శించగా 7.65 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు.

జబర్దస్త్ సత్తిపండు సందడి..

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం వద్ద ఆదివారం జబర్దస్తు నటుడు సత్తిపండు సందడి చేశారు. ఆయనను వాటర్ ఫాల్స్ మేనేజర్ ఆర్ నవీన్, సూపర్ వైజర్ వి అభి, సభ్యులు రాజు, పెద్దబ్బాయి, బాబూరావు, చంటి,అప్పారావు, ప్రశాంత్ తదితరులు ఆహ్వానించారు. ఆయనతో ఫొటోలు దిగారు.

కొత్తపల్లి జలపాతానికి..

జి.మాడుగుల: పాడేరు- చింతపల్లి మార్గంలో కొత్తపల్లి జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలకు సెలవు దినం కావడంతో ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి సందడి చేశారు. కబాబులు, బొంగు చికెన్ అమ్మకాలు భారీగా జరిగాయి.

పాపికొండలకు పర్యాటకుల తాకిడి

వీఆర్‌పురం: పాపికొండలకు పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం పోచవరం బోట్ పాయింట్‌కు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. గోదావరి వరదలతో పర్యాటకం నిలిచిపోవడం తెలిసిందే. దీంతో నిత్యం పర్యాటకులతో కళకళ లాడే బోట్ పాయింట్ వెలవెలబోయి ఉండేది. ఈనేపథ్యంలో ఈనెల 10వ తేదీ నుంచి పాపికొండల పర్యాటక బోటింగ్‌ను అధికారికంగా పునఃప్రారంభించారు. ఆదివారం 7 బోట్లలో 500 మందికి పైగా పర్యాటకులు పాపికొండల అందాలు తిలకించేందుకు వెళ్లారని ఏపీ టూరిజం కౌంటర్ అసిస్టెంట్ రాజేష్ తెలిపారు. అధిక సంఖ్యలో పర్యాటకుల రాకతో బోటింగ్ పాయింట్, పేరంటపల్లి శివాలయం, కొల్లూరు హట్స్ సందడిగా మారాయి.



పోచవరం బోట్ పాయింట్ వద్ద బోటు ఎక్కుతున్న పర్యాటకులు



జబర్దస్తు సత్తిపండుతో కొత్తపల్లి వాటర్‌ఫాల్స్ సిబ్బంది



మంట కాగుతున్న పర్యాటకులు



వ్యూపాయింట్ వద్ద పర్యాటకుల సందడి



పాపికొండల విహారయాత్రకు వచ్చిన పర్యాటకులు



రాణిదుడుమ జలపాతం వద్ద పర్యాటకుల సందడి

బ్యూటిఫుల్ జర్నీ

- లోయలు..సొరంగాల్లోంచి ప్రయాణం
- కోరాపుట్-రాయగడ (కే-ఆర్) లైన్‌లో అద్భుత దృశ్యాలు
- పర్యాటకులకు కనువిందు చేసే లొకేషన్స్
- బొర్రా, అరుకును మించి అద్భుత సొరంగాలు
- వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో ప్రెస్‌టూర్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): అద్భుతమైన ప్రకృతి అందాలు, ఎత్తయిన, పచ్చని కొండలు, వీటిని మించి మరపురాని సొరంగ మార్గాల ద్వారా ప్రయాణాన్ని ఆస్వాదించాలని ఉందా? ఇంకెందుకు ఆలస్యం.. మన పక్కనే ఉన్న ఒడిశాలోని కోరాపుట్‌కు వెళ్తే చాలు.. ఈ అనుభూతులన్నీ మీ సొంతమతాయి. అవేమిటో..ఈ రూట్ విశేషాలను పర్యాటక ప్రేమికుల కోసం ప్రత్యేకం.

కే-ఆర్ (కోరాపుట్-రాయగడ)లైన్

వాల్తేర్ డివిజన్‌కు ప్రధానంగా ఆదాయాన్నిచ్చే కిరండూల్, బచేలిలో ఉన్న ఐరన్ ఓర్ రవాణా మార్గానికి ప్రత్యామ్నాయంగా వేరే లైన్‌ను ఏర్పాటుచేసి ఈ సరకు రవాణాను మరింతగా అభివృద్ధి పరచాలనే ఉద్దేశ్యంతో 1980లలో కోరాపుట్ - రాయగడ (కే-ఆర్)లైన్‌ను ప్రారంభించగా..1993-92మధ్య ఈ లైన్ పూర్తయింది. కోరాపుట్ నుంచి రాయగడకు మొత్తం 167కి.మీల మేర ఈ లైన్ ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో మొత్తం 36 సొరంగాలు, 76 ప్రధాన వంతెనలు, 180 అందమైన మలుపులు ఉన్నాయి. అప్పట్లో ప్రధానంగా ఈ మార్గం వైజాగ్ స్టీల్‌ప్లాంట్, వైజాగ్ పోర్ట్ ట్రస్ట్‌లకు అవసరమైన ఐరన్‌ఓర్‌ను రవాణాను పెంచేందుకు ప్రత్యామ్నాయ మార్గంగా వినియోగించేవారు.

పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి

అనంతరం ఈ మార్గంలో అల్యూమినా పౌడర్ సరఫరా చేసే నాల్కో, ఉత్కళ్ అల్యూమినా, వేదాంత, జేకే పేపర్, ఇంఫా (ఇండియా మెటల్ అండ్ ఫెర్రో అల్లాయ్), హెచ్‌పీసీఎల్ గ్యాస్ బాట్లింగ్ ప్లాంట్ వంటి పరిశ్రమలకు ఎంతో అనుకూలంగా ఉండేది. ప్రస్తుతం ఈ మార్గంలో రెండో లైన్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం 2015-16లో రూ.2500 కోట్లు బడ్జెట్ మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 2026నాటికి రెండోలైన్ పూర్తి చేయనున్నారు.

పర్యాటక, పుణ్యక్షేత్రాల సమాహారం...

ఆంధ్రా, ఒడిశా సదరన్ డివిజన్‌లో ప్రసిద్ధిచెందిన మజ్జిగౌరమ్మ ఆలయం రాయగడ ప్రాంతంలోనే ఉంది. రాయగడకు కేవలం 50కి.మీల దూరంలో చిత్రకోన జలపాతం ప్రత్యేక ఆకర్షణ.తెరుబలిలో గల ఇంఫా ఫ్యాక్టరీ వద్ద ప్రసిద్ధి చెందిన లక్ష్మీనారాయణ ఆలయం.. కోరాపుట్‌లో రాణి డుడుమ వాటర్ ఫాల్స్, జగన్నాథస్వామి ఆలయాలు ఉన్నాయి. గుప్తేశ్వర గుహలు. డియోమలి హిల్స్, కోలాబ్ రిజర్వాయర్ కోరాపుట్‌లోనే ఉన్నాయి.



వంతెనలపై దూసుకుపోతున్న రైలు

గుహల్లో, వంతెనలపై మరపురాని ప్రయాణం

ఈ మార్గంలో సొరంగాలలో నుండి రైలు దూసుకుపోతుంటే ఆ అనుభూతులే వేరు. సుమారు 36 చిన్న, పెద్ద సొరంగాలు. ఈ మార్గంలోనే రాలీ స్టేషన్‌కు సమీపంలో తూర్పుప్రాంతంలోనే అత్యంత పొడవైన సొరంగమార్గం ఉంది. దీని పొడవు 1,599మీటర్లు (1.59 కిలోమీటర్లు). ప్రకృతి సోయగాలు, లోతైన, ఎత్తైన కొండలపై ప్రయాణం. సముద్రమట్టానికి ఆరు వేల అడుగుల ఎత్తులో కోరాపుట్ రైల్వే స్టేషన్. అందమైన వంతెనలు ఇటువంటి ఎన్నో ప్రత్యేకతలు ఈ మార్గంలో ఉన్నాయి. సాధారణంగా అరకు, బొర్రాగుహలుకు అధిక సంఖ్యలో పర్యాటకులు వెళ్తుంటారు, కానీ ఒకసారి ఈ ప్రాంతాలను సందర్శిస్తే మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుంది.

వెలుగులోకి తీసుకువచ్చిన వాల్తేర్ డివిజన్

కోరాపుట్-రాయగడ మార్గం ఇప్పటివరకు చాలామందికి తెలియదు. వాల్తేర్ డివిజన్‌కు డివిజనల్ రైల్వే మేనేజర్ గా వచ్చిన అనూప్‌కుమార్ సత్పతి అతి తక్కువ సమయంలో ఈ మార్గంలో పర్యటించి, తనిఖీలు చేసి దీనిని పర్యాటకులకు పరిచయం చేశారు. ఈ మార్గంలో పర్యాటకుల కోసం తొలిసారిగా విస్టాడోమ్ కోచ్‌ను జతచేశారు. వారానికి మూడుసార్లు నడిచే విశాఖపట్నం-కోరాపుట్ స్పెషల్ ప్యాసింజర్ రైలుకు ఈ విస్టాడోమ్ కోచ్ జతచేస్తున్నారు.

40 ధాన్యం మిల్లులకు ట్యాగింగ్

- జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎం గణేష్‌కుమార్

రాజవొమ్మంగి: ధాన్యం కొనుగోలుకు సంబంధించి 40 మిల్లులకు ట్యాగింగ్ చేశామని జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎం గణేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన ఫోన్లో మాట్లాడారు. కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలో మిల్లులకు ట్యాగింగ్‌చేశామని ఆయన వివరించారు. రంపచోడవరం డివిజన్‌లో త్వరలో ప్రారంభం కానున్న 43 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అవసరమైన 13 వేల గన్నీ బ్యాగ్స్ (గోనె సంచులు)ను సిద్ధం చేశామన్నారు. వీటిని రంపచోడవరం డివిజన్‌లోని 43 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సోమ, మంగళవారాల్లో తరలిస్తామని చెప్పారు. చింతూరు డివిజన్‌లో కూడా 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్టు ఆయన వివరించారు. రాజవొమ్మంగి మండలం జడ్డంగిలో ఇప్పటికే ఒక ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్టు చెప్పారు.

మిగతా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు..

రాజవొమ్మంగి, లాగరాయి, దూసరపాము, కొమరాపురం, శరభవరం రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు త్వరలో ప్రారంభిస్తామని అడ్డతీగల ఏడీఏ కంకిపాటి సావిత్రి తెలిపారు. ఈ ప్రాంతంలో వరికోతలు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఆమె చెప్పారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



మళ్లీ చలిపులి

పాడేరు మండలం మినుములూరు ప్రాంతంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

- వణికిస్తున్న చలిగాలులు
- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- మినుమూలూరులో 11..
- అరకులోయలో 12.3..
- చింతపల్లిలో 13 డిగ్రీల నమోదు

సాక్షి, పాడేరు: జిల్లాలో చలిగాలులు మళ్లీ విజృంభిస్తున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో అన్ని వర్గాల ప్రజలు చలితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొగమంచు దట్టంగా కురుస్తోంది. పాడేరు మండలం మినుమూలూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద ఆదివారం ఉదయం 11 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీ బోర్డు వద్ద 12.3 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 13 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పొగమంచు తీవ్రంగా ఉండడంతో సూర్యోదయం ఆలస్యమైంది. చలిగాలలు విజృంభిస్తుండడంతో ప్రజలు చలిమంటలను ఆశ్రయించారు.

చింతపల్లి రూరల్: ఆంధ్రా కశ్మీర్ లంబసింగిలో ఆదివారం పొగమంచు దట్టంగా కురిసింది. చలిగాలులకు స్థానికులు, పర్యాటకులు వణికిపోయారు.



పాడేరులో చలిమంట కాగుతున్న కూలీలు



లంబసింగిలో దట్టంగా కురుస్తున్న మంచు

● ఆదాయం.. ఉపాధి..



మన్యంలో కాఫీ పళ్లు

కాఫీ పండ్లను నేరుగా విక్రయించడం వల్ల గిరి రైతులు ఆదాయం కోల్పోతున్నారు. పల్పింగ్ చేసి విక్రయించడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. ఈ దిశగా రైతులను ప్రోత్సహించేందుకు అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. ఇందుకుకోసం స్థానికంగా పల్పింగ్ పరిశ్రమలను ఏర్పాటుచేస్తోంది. దీనివల్ల నాణ్యత పెరగడంతో పాటు పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

– గూడెంకొత్తవీధి

8లో

క్లుప్తంగా

బాబా రాందేవ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

చింతూరు: మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన బాబా రాందేవ్‌పై చర్యలు తీసుకోవాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం చింతూరు మండలం తుమ్మలలో జాతీయ రహదారిపై రాందేవ్ చిత్రాలను దహనం చేశారు. వారు మాట్లాడుతూ మహిళల పట్ల అనుచితంగా మాట్లాడిన అతనిపై కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రంగమ్మ, సుబ్బమ్మ, గిరిజ, కిట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



తుమ్మపాల: అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీ పాత తలారివానిపాలెంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలో పంచాదార్ల పైడమ్మ అనే మహిళ నివాసముంటున్న పూరింటిలో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భయంతో పరుగులు తీసిన పైడమ్మ గ్రామస్తులకు సమాచారం తెలపడంతో వారు మంటలు అదుపు చేశారు. అప్పటికే వంట సామగ్రి, సరకులు, గృహోపకరణాలు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. పైడమ్మకు భర్త, పిల్లలు లేరు. గ్రామంలో కూలీపనులు చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తోంది. అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితురాలు, గ్రామస్తులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వలంటీర్‌కు గాయాలు

కశింకోట: మండలంలోని బయ్యవరం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విసన్నపేటకు చెందిన గ్రామ వలంటీర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ ఆదినారాయణరెడ్డి అందించిన వివరాల ప్రకారం.. బయ్యవరం వద్ద ముందు వేగంగా వెళుతున్న కారును ఆకస్మాత్తుగా ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా కుడి నుంచి ఎడమకు తిప్పి డ్రైవర్ అజాగ్రత్తగా నిలుపుదల చేయగా అదే మార్గంలో వెనుకగా వస్తున్న బైక్ అదుపు తప్పి ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న విసన్నపేట గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ కొఠారి పవన్‌కుమార్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను అనకాపల్లిలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆదాయం.. ఉపాధి..

- కాఫీ రైతులకు అందుబాటులోకి వస్తున్న సౌకర్యాలు
- గూడెంకొత్తవీధిలో ఎకో పల్పింగ్ యూనిట్
- చురుగ్గా నిర్మాణ పనులు
- గిరి రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు



గూడెంకొత్తవీధిలో కాఫీ శుద్ధి కర్మాగారం పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి.. ఇది ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ.. ప్రస్తుత అల్లూరి జిల్లాలోనూ చివరి మండలం. ఒడిశా సరిహద్దును ఆనుకొని ఉన్న ఈ మండలంలో ఇప్పటివరకు ప్రభుత్వ రంగ పరిశ్రమలేవీ లేవు. కేవలం ఇక్కడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అభివద్ధి సంస్థకు చెందిన కాఫీతోటలు మాత్రమే ఉండేవి. కాలక్రమంలో కేంద్ర కాఫీబోర్డు, రాష్ట్ర ప్రభుత్వం, ఐటీడీఏల ప్రోత్సాహంతో మన్యంలో కాఫీ తోటల విస్తీర్ణం భారీగా పెరిగింది. ఏజెన్సీ వ్యాప్తంగా సుమారు 2.20 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు సాగవుతున్నాయి. సుమారు రెండు లక్షల మందికి పైగా గిరిజనులు కాఫీతోటలను వాణిజ్యపరంగా సాగు చేస్తున్నారు. వీరు 1.58 లక్షల ఎకరాల్లో కాఫీతోటల ద్వారా ఫలసాయం పొందుతున్నారు. కాఫీసాగు విస్తీర్ణం పెరుగుతున్నా అందుకు తగ్గట్టుగా రైతులు దిగుబడులు, నాణ్యత సాధించలేకపోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు రైతులను పూర్తిగా చైతన్యపరిచే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. శాస్త్రీయ విధానాలు, సౌకర్యాలు అందుబాటులోకి తెస్తున్నారు.

ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రం..

నాలుగేళ్ల కిందట చింతపల్లిలో కాఫీ శుద్ధీకరణకు సంబంధించి ప్రత్యేకంగా ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాన్ని సుమారు రూ.15 కోట్ల వ్యయంతో నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం నిర్మించింది. దీని నిర్వహణను కాఫీ ఉత్పత్తిదారుల సంఘమే పర్యవేక్షిస్తోంది. ఇప్పుడు ఇదే తరహాలో గూడెంకొత్తవీధి మండల కేంద్రంలోనూ గిరిజన రైతుల సౌకర్యార్థం కాఫీ పరిశ్రమను ప్రభుత్వం నెలకొల్పుతోంది. ఇప్పటికే కొంతమేర పనులు పూర్తయ్యాయి. వచ్చే సీజను నాటికి ఈ పరిశ్రమను అందుబాటులోకి రానుంది. పనులు వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఇప్పటికే ఆదేశించారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే గూడెంకొత్తవీధి మండలంలోని 16 పంచాయతీల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రోజుకు సుమారు 300 మందికి ఉపాధి అందుబాటులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

కాఫీ రైతులకు లాభాలు

గిరిజన ప్రాంతాల్లో రైతులు కాఫీని పండిస్తున్నా పంట చేతికందే సమయానికి దళారులకు విక్రయించాల్సి వస్తోంది. దీనివల్ల రైతులకు ఆశించిన ధరలు రావడం లేదు. రైతుల వారి అవసరాలకోసం వ్యాపారుల వద్ద ముందుగా కొంత నగదును తీసుకోవడం వల్లే ఈ సమస్య ఎదురవుతోంది. ఈ పరిశ్రమ అందుబాటులోకి వస్తే కాఫీకి మంచి ధరలు లభిస్తాయి. తద్వారా రైతులు దళారులను ఆశ్రయించే అవకాశం ఉండదు. – అడపా విష్ణుమూర్తి, కాఫీ రైతు, ఉత్పత్తిదారుల సంఘం సభ్యుడు

ధరలు.. దిగుబడి సమాచారం

కాఫీ పండ్లు కిలో : రూ. 36
పాచ్‌మెంట్ కాఫీ (పల్పింగ్) రూ.270
పల్లింగ్ ధర (కిలోకు) రూ.2
ఆరు కిలోల పండ్లకు : కిలో పాచ్‌మెంట్

గిరిజనులకు ఉపాధి



గూడెంకొత్తవీధిలో ఏర్పాటు చేయనున్న కాఫీ పల్పింగ్ యూనిట్ వల్ల వందల మంది గిరిజనులకు స్థానికంగా ఉపాధి అందుబాటులోకి వస్తుంది. భవిష్యత్తులో ప్రతి మండలంలోనూ ఇటువంటి పరిశ్రమలను నెలకొల్పే దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.
– గోపాలకృష్ణ, ఐటీడీఏ పీవో, పాడేరు

విద్య, వైద్యం.. అభివృద్ధే ధ్యేయం

- ఐదేళ్లలో టీడీపీకి చేతకానిది మూడేళ్లలో మేం చేసి చూపాం
- విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం పెద్దపీట
- ఐటీ, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: అయిదేళ్ల కాలంలో టీడీపీ చేయలేని అభివృద్ధి కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపించిందని రాష్ట్ర ఐటీ, వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రూ.12 లక్షలతో మండలంలోని అక్కిరెడ్డిపాలెం పంచాయతీ శీరంశెట్టివానిపాలెం అంగన్‌వాడీ భవన నిర్మాణానికి, రూ.2.25 కోట్లతో తారకరామారావు కాలనీలో హైస్కూల్ భవన నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఊడేరు గ్రామంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తమ స్వార్థ ప్రయోజనాలకే పెద్ద పీట వేసిందని, ఇపుడు తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే.. తట్టుకోలేక అడ్డుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడున్నరేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఓర్వలేని టీడీపీ నాయకులు ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. విశాఖకు ఇన్ఫోసిస్‌లాంటి దిగ్గజ సంస్థల కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తారకరామారావుకాలనీ చుట్టుపక్కల గ్రామాల్లోని 400 మంది విద్యార్థులు చదువుతోన్న ఈ హైస్కూల్లో మౌలికవసతులు కల్పించడం చేతకాని టీడీపీ నేతలకు, తాము చేస్తున్న అభివృద్ధి పనులను చూసైనా కనీస జ్ఞానాన్ని ప్రసాదించాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. గడిచిన మూడేళ్లలో డ్రైనేజీ, రహదారి నిర్మాణానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సుమారు రూ.6 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్టు వివరించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని కొనియాడారు. బడుగు, బలహీనవర్గాలకు మెరుగైన విద్యనందించేందుకు ఈ హైస్కూల్ ఎంతో దోహదపడుతుందన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి మాట్లాడుతూ చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు. కోడూరు గ్రామంలో ఆటోనగర్ స్థాపన ఘనత మంత్రి అమర్‌నాథ్‌కే దక్కుతుందన్నారు. డీఈవో లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ భావితరాలను దృష్టిలో పెట్టుకొని నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, డీటీ వై.శ్రీరామ్మూర్తి, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో దివాకర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ సాలాపు శాంతి, పార్టీ నేతలు కృష్ణమోహన్, నారపిన్ని ప్రసాద్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న గుడివాడ అమర్‌నాథ్

రాష్ట్ర స్థాయి పోస్టర్ కాంపిటేషన్‌కు దేవరాపల్లి విద్యార్థినులు



జిల్లా స్థాయి పోస్టర్ కాంపిటేషన్‌లో బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

దేవరాపల్లి: జిల్లా స్థాయి పోస్టర్ కాంపిటేషన్‌లో దేవరాపల్లి హైస్కూల్ విద్యార్థినులు సత్తా చాటారు. భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ నెల 26న కశింకోటలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో దేవరాపల్లి విద్యార్థినులు పి.రజిత జనరల్ థీమ్ విభాగంలోనూ, పి. జలహాసిని ఆజాదీకా అమృత్ మహోత్సవ్ విభాగంలోనూ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరికి రూ. 2 వేల చొప్పున ప్రోత్సాహకాలతోపాటు సర్టిఫికెట్, జ్ఞాపికలు అందజేశారు. వీరిద్దరూ వచ్చే నెల 8, 9 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు బి. చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థినులతోపాటు సైన్స్ ఉపాధ్యాయుడు యు. శ్రీనివాసరావు, క్రాఫ్ట్ టీచర్ ఇ. సాగర్‌లను స్థానిక హైస్కూల్‌లో ఆదివారం హెచ్‌ఎం ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థుల ఆకతాయి చేష్టలు

- పోలీసులకు బ్రాహ్మణవీధి వాసుల ఫిర్యాదు



విద్యార్థుల గదిలో లభ్యమైన గంజాయి

నర్సీపట్నం: బాగా చదువుకుని ప్రయోజకులు కావలసిన విద్యార్థులు నిత్యం ఆకతాయి చేష్టలకు పాల్పడుతుండడంతో విసిగిపోయిన మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణ వీధి వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బయట ప్రాంతాల నుంచి చదువుకునేందుకు వచ్చిన కొంత మంది విద్యార్థులు బ్రాహ్మణవీధిలో ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వారు ఆకతాయి చేష్టలకు పాల్పడుతుండడంతో చుట్టు పక్కల నివాసముంటున్న వారికి ఇబ్బందికరంగా మారింది. దీంతో స్థానికులు రెండు, మూడు సార్లు విద్యార్థులను హెచ్చరించారు. అయినప్పటికీ మార్పు రాకపోవడంతో ఈ నెల 26వ తేదీ రాత్రి చుట్టుపక్కల వారు మూకుమ్మడిగా ఆ ఇంటిపైకి వెళ్లారు. అప్పటికే విద్యార్థులు పరారయ్యారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసు మొబైల్ సిబ్బంది అక్కడకు చేరుకుని ఇంటిని తనిఖీ చేశారు. ఇంట్లో పావు కిలో గంజాయి పొడి లభ్యమైంది. కండోమ్స్, సిగరెట్లు ఉండటాన్ని పోలీసులు గమనించారు. ఇంటి యజమాని ఇచ్చిన వివరాల ఆధారంగా పరారైన విద్యార్థుల కోసం గాలిస్తున్నామని ఎస్ఐ గోవిందరావు తెలిపారు. గంజాయి లభ్యమవటం వాస్తమేనని చెప్పారు. గంజాయి సేవించేందుకు ఉంచారా లేక విక్రయించడానికి ఉంచారన్న దానిపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

29న ఏపీఆర్‌డీసీ డైరెక్టర్‌గా బత్తుల ప్రమాణస్వీకరం



అడ్డతీగల: రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన అడ్డతీగల మండలం రాయపల్లికి చెందిన బత్తుల సత్యనారాయణ ఈనెల 29న మంగళవారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కార్పొరేషన్ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు, కార్పొరేషన్ ఎండి ఎల్.శ్రీనివాసులురెడ్డి నుంచి ఆదివారం తనకు సమాచారం అందిందని బత్తుల సత్యనారాయణ వెల్లడించారు. తనతో పాటు కార్పొరేషన్‌లో డైరెక్టర్లుగా నియమితులైన మిగతా 13 మంది డైరెక్టర్లు ఆ రోజు ముందుగా నిర్ణయించిన విజయవాడలోని ఆర్‌అండ్‌బీ హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేస్తారన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

HINDI COACHING CENTER
- హిందీ బేసిక్స్, గ్రామర్, స్పోకెన్ హిందీ, హిందీ పరీక్షల కోచింగ్, థర్డ్‌స్టాండర్డ్ బాలల నుండి ఎవరైనా హిందీ పరీక్షలు రాయవచ్చును. NAD, గోపాలపట్నం, మురళీనగర్. శ్రీధర్ – హిందీ మాస్టర్ : 94412 46591 [V- 791986]

Goods

SECOND SALE
- Midhun Agency All wood Old Furniture AC's Fridge, Invertor Batteries UPS, Motors' Old Iron Scrap Buying. Ph : 63097 45364 [V-9866]

Real Estate

HOUSE FOR SALE
- Atchutapuram Sez Road Sripuram Gardens Phase-1, 167 Smd's 1400 Sft 2 BHK House @ 58 Lakhs For Immediate Sale. Ph : 88229 09999 [V-2380]

LAND FOR SALE
- గంట్లాం శ్రీ శాంతి లేఅవుట్ దగ్గర 3½ ఎకరాలు, 1 ఎకరా భూమి శ్రీ శాంతి లేఅవుట్‌లో 2 స్థలాలు (875,900 గజాలు) అమ్మకానికి కలవు. మరియు VZM, VSP జిల్లాలలో Land అమ్మలన్నా, కొనాలన్నా సంప్రదించండి 9440122503 [S-745721]

PLOT FOR SALE
- విశాఖ స్మార్ట్ సిటీ కోటపాడు దగ్గర్లో RY అగ్రహారంలో తక్షణమే ఇల్లు కట్టుకొనే స్థలం 60 చ॥గ॥ 2 లక్షలకే, స్పాట్ చేయించుకున్నవారికి రిజిస్ట్రేషన్ ఫ్రీ. ఫోన్ : 81797 35533, 97043 33933 [V- 2323]
- కాకినాడ భానుగుడి, 80 అడుగులు మిలటరీ రోడ్డు – దక్షిణం, తూర్పు ఫేసింగ్, శ్రీనగర్, సురేష్ నగర్, వాకలపూడి, ఉప్పాడ బీచ్ రోడ్డులో DTCP లే-అవుట్ స్థలములు కలవు. Cont: P.A. స్వామి, సెల్ : 98481 07949, 99856 46888 [R-149]

TO-LET
- 3 BHK Flat for Rent in Midhilapuri, Madhurawada, SMS 8331016245 . [WB-40501]

Services

BEAUTY CARE
- Wanted Massage Therapist Experienced & Freshers Salary 20000 to 30000 with Accomo dation. Contact No. 9094623623 [H-776714]

GOLD LOANS
- లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 454]

T.V. REPAIR
- SVS TV రిపేర్స్ : 83677 16961 LED, LCD, A/C, వాషింగ్ మిషన్స్, ఫ్రిజ్, మైక్రోఓవెన్, మీ ఇంటి వద్దనే స్పాట్ రిపేర్ చేయబడును. 25 సం॥ Ex, 5 సం॥ వారంటీ కలదు. [V-791941]

Wanted
- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-782430]
- చదువుతో సంబంధం లేకుండా వైజాగ్ ప్రముఖ షాపింగ్‌మాల్స్‌లో పనిచేయుటకు 18 నుండి 35 సం॥లు గల యువకులు కావలెను. జీతం : 12000/- + ఫుడ్ రూమ్స్ సదుపాయం కలదు. డైరెక్ట్ జాయినింగ్. ఫోన్ : 91542 96345, 91542 96346 [V-6429]
- గాజువాక, శీలానగర్, NAD పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం : 12 వేలు వరకు. ఫోన్ : 97057 67888, 97051 56333 [V-1627]
- ITI, డిప్లమో, 10th వారికి వైజాగ్‌లో జాబ్స్. అడ్రస్ : RSR కన్సల్టెన్సీ, ఓన్లీ విమల్ షోరూం పై 3వ ఫ్లోర్, CMR నుంచి జగదాంబ రోడ్డు, వైజాగ్. ఫోన్ : 77029 59468 [V-573]
- NAD, మధురవాడ ఏరియాలలో సెక్యూరిటీ (M/F), హౌస్ కీపింగ్ (M/F) కావలెను. వసతి, భోజనం కలదు. జీతం : 15 వేలు వరకు. ఫోన్ : 97057 67888 [V-1624]
- లేపాక్షి హెల్త్ కేర్ సర్వీసెస్, వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు కేర్ టేకర్స్ కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. Qual: 10th-డిగ్రీ, Age: 20-45. జీతం: 20K. Hyd. Ph: 9640300074. [HA-087]
- ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో కార్గో సూపర్‌వైజర్స్, హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, లోడర్స్ కావలెను. జీ: 20,000/- to 30,000/- రూం+మీల్స్ ఫ్రీ. Q: 5th to డిగ్రీ. 9885185325 [H-778937]
- ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే ఉంటూ పార్ట్ టైం 1గం॥ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పు॥ కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. సంప్ర॥ 7032951147 [G-782433]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్
లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్



ట్రాక్టర్ బోల్తాతో మృతిచెందిన శ్రీహరి



సంఘటనా స్థలంలో పడివున్న నరేష్ మృతదేహం

మునగపాక/చింతూరు: అనకాపల్లి మునగపాక, అల్లూరి సీతారారాజు జిల్లా చింతూరు మండాలల్లో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. మునగపాక నుంచి వాడ్రాపల్లికి వెళ్లే మార్గంలో గల ఇటుకబట్టీ వద్ద ట్రాక్టర్ బోల్తా పడి బట్టీ యజమాని మృతిచెందాడు. ఏఎస్ఐ మన్మధరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జాతీయ రహదారి సమీపంలో కుందురు శ్రీహరి(39)నివాసం ఉంటున్నారు. ఐదేళ్లుగా మునగపాక సమీపంలో ఇటుకబట్టీ నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం బట్టీని పరిశీలించేందుకు వచ్చిన ఆయన బురదమట్టిని కలియదున్నేందుకు ట్రాక్టర్‌ను నడుపుతున్న క్రమంలో బోల్తాపడింది. ట్రాక్టర్ నడుపుతున్న శ్రీహరి ట్రాక్టర్ కింద పడి మృతిచెందినట్టు ఏఎస్ఐ చెప్పారు. శ్రీహరి భార్య రమాదేవి సంఘటన స్థలానికి చేరుకొని భోరున విలపించారు. మృతుడు శ్రీహరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. ఏఎస్ఐ మన్మధరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి

చింతూరు మండలంలోని నర్సింగపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చిడుమూరుకు చెందిన న్యాయవాది కలుముల నరేష్(38) మృతిచెందాడు.

చిడుమూరుకు చెందిన రమేష్ బైక్‌పై శనివారం రాత్రి నర్సింగపేటలోని తన సోదరి వద్దకు వెళుతున్న క్రమంలో బైక్ అదుపుతప్పి గోతిలో పడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. గోతిలో పడి ఉన్న రమేష్‌ను ఆదివారం ఉదయం గమనించిన గ్రామస్తులు అతని కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు.

వదిన మృతదేహానికి తలకొరివి పెట్టిన మరదలు



అంతిమయాత్రలో పాల్గొన్న లక్ష్మి

మునగపాక: ఓ వృద్ధురాలి మృతదేహానికి ఆమె తమ్ముడి భార్య తలకొరివి పెట్టిన సంఘటన మునగపాకలో చోటు చేసుకుంది.వివరాలు ఇలా ఉన్నాయి. భర్త మృతి చెందడంతోమొల్లేటి అప్పలనరసమ్మ(62) స్థానిక మెయిన్‌రోడ్డులో ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఆదివారం ఉదయం అప్పలనరసమ్మ మృతి చెందింది.అప్పలనరసమ్మకు పిల్లలు లేకపోవడంతో తుమ్మపాలలో నివాసం ఉంటున్న తమ్ముడు భార్య(మరదలు) లక్ష్మి తలకొరివి పెట్టింది. తానే కొడుకుగా వ్యవహరించి తలకొరివి పెట్టిన లక్ష్మిని స్థానికులు అభినందించారు.

జన'సంద్రం'

- రేవుపోలవరం తీరం పర్యాటకుల సందడి



బొజ్జన్నకొండ దిగువన పిక్నిక్ ప్రియుల తాకిడి



బొజ్జన్న కొండపై పర్యాటకులు

ఎస్.రాయవరం: కార్తీక వన సమారాధన ముగిసినప్పటికీ మండలంలోని రేవుపోలవరం తీరం పర్యాటకులతో కళకళలాడింది. ఇక్కడకు ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చి సందడి చేశారు. ఏటా కార్తీక మాసంలో ఇటువంటి వాతావరణం కనిపిస్తోంది. సాధారణ రోజుల్లోనూ ఈ ప్రాంతం కిక్కిరిసేలా పర్యాటకులు వచ్చారు. ఉదయం నుంచి ఇసుక తిన్నెల్లో ఆటపాటలతోపాటు జలకాటాల్లోనూ పోటీపడ్డారు. మరోవైపు వాతావరణం చల్లబడి మబ్బుగా ఉండటంతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

బొజ్జన్నకొండపై..


అనకాపల్లి టౌన్: మండలంలో శంకరం, సత్యనారాయణపురం గ్రామాల కొండలు పిక్నిక్ ప్రియులతో ఆదివారం సందడి చేశాయి. పూర్వ విద్యార్థి సంఘాలతోపాటు కుల సంఘాల ఆధ్వర్యంలో చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. మధ్యాహ్నం సామూహిక వన భోజనాలు చేశారు. బొజ్జన్న కొండపై బుద్ధుని గృహను సందర్శించి యువత సెల్ఫీలు దిగింది.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై స్థానికులు వినతిపత్రాలను అందజేశారు. ఆయన స్పందించి సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నారావు, రాందాస్, భాస్కర్‌రావు, ప్రకాష్, రాంనాయుడు తదితరులు పాల్గున్నారు.

ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్య

- ఫైజర్ సంస్థ ఉద్యోగార్థులకు బంఫర్ ఆఫర్



ఫైజర్‌లో ఉద్యోగాలకు పరీక్ష రాస్తున్న అభ్యర్థినులు

చోడవరం రూరల్: ఫైజర్ సంస్థలో ఉద్యోగం చేస్తూనే.. విశాఖ గీతం కాలేజీలో డిగ్రీ విద్యను పూర్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని ఆ సంస్థ రిక్రూట్‌మెంట్ టీమ్‌లీడర్ కుమారస్వామి తెలిపారు. పరవాడ కేంద్రంగా పనిచేస్తున్న ఫైజర్ హెల్త్ కేర్ ఇండియా లిమిటెడ్ సంస్థలో ఉద్యోగాలకు ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాను కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు ప్రారంభించారు. 75 మందికి పైగా అభ్యర్థులు హాజరు కాగా, 62 మంది ఎంపిక పరీక్షను ఎదుర్కొన్నారు. వీరిలో 45 మంది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. మౌఖిక పరీక్షలో విజేతలైన వారందరికీ ఆఫర్ లెటర్లు ఇస్తామని కుమారస్వామి తెలిపారు. అయితే ఈ మేళాలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని సూచించారు. దాంతో పలువురు డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు నిరాశగా వెనుదిరిగారు.

క్రమశిక్షణకు మారు పేరు ఎన్‌సీసీ



ఎన్‌సీసీ కేడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ డిగ్రీ కాలేజీలో ఎన్‌సీసీ డే ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాయకరావుపేట సీఐ పి.అప్పలరాజు ముఖ్య అతిథిగా హాజరై ఎన్‌సీసీ కేడెట్ల నుంచి గౌరవ వందనాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులకు పూర్తి స్థాయి క్రమశిక్షణ ఉంటుందన్నారు. కాలేజీ దశలో వారి భవిష్యత్తుకు ఎన్‌సీసీ బాటలు వేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీర్రాజు, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్లు చేసిన పిరమిడ్లు పలువురిని ఆకట్టుకున్నాయి.